

# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం








సంపుటి : 4 | సంచిక : 16 | సెప్టెంబర్ 22 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





# జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ల మౌనం!

- తోటి విలేకరికి అన్యాయం జరిగినా స్పందన కరువు..
- అరెస్టులపై సంఘీభావం ఎక్కడ?
- పదవుల కోసం పరుగులా.. జర్నలిస్టుల ప్రయోజనాల కోసం పోరాటమా?
- నిజామాబాద్ జిల్లాలో అక్రమ కేసులు.. భయాందోళనలో సీనియర్ జర్నలిస్టులు.

**ఉమ్మడి,నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్: సమాజంలో జరిగే మంచి, చెడులను వెలుగులోకి తీసుకువస్తూ, అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తూ ప్రజలకు సమాచారాన్ని అందించే జర్నలిస్టులే నేడు తమ సమస్యలపై ప్రశ్నించుకోలేని పరిస్థితి నెలకొందని పలువురు జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో 365 రోజులు ప్రజా సమస్యలపై కలం ఎత్తే విలేకరులకు ఎదురవుతున్న ఇబ్బందులు, అవమానాలు, అన్యాయాలపై జర్నలిస్టు సంఘాలు ఆశించిన



(మిగతా 2వ పేజీలో..)

## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం
- బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ
- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్

ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది

(మిగతా 2వ పేజీలో..)



## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్... శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

- రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన
- ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి
- గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ
- ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం
- నెల రోజుల్లో అన్నిచోట్లా పనులు మొదలని ప్రకటన

శేరిలింగంపల్లి నియోజకవర్గం

(మిగతా 2వ పేజీలో..)




## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

సిద్ధిపేట జిల్లా మర్కూక్ మండలం

(మిగతా 2వ పేజీలో..)



## ఎల్‌నినో’ను ఎదుర్కొనేందుకు ప్లాన్ చేయండి.. అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

**మన దునియా,హైదరాబాద్: సెప్టెంబర్ 21**

తెలంగాణ : ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దీటుగా ఎదుర్కొనేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.సోమవారం ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఇతర ఉన్నతాధికారులతో ఆమె ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై సమగ్రంగా చర్చించి, అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని

(మిగతా 2వ పేజీలో..)



## లండన్ కాదు.. కోయంబత్తూరు, మధురైకి వెళ్లండి: సీఎం విజయ్‌కు అన్నామలై సూచన

- తమిళనాడు సీఎం విజయ్ లండన్ పర్యటనపై అన్నామలై విమర్శలు
- విదేశాల బదులు రాష్ట్రంలోని పారిశ్రామిక నగరాల్లో పర్యటించాలని సూచన
- స్థానిక వ్యాపారులకు పన్ను మినహాయింపులు ఇవ్వాలని ప్రభుత్వానికి హితవు

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ఎల్‌నినో’ను ఎదుర్కొనేందుకు ప్లాన్ చేయండి..
## అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆమె సూచించారు.అన్ని గ్రామాలకు ఒకే రకమైన ప్రణాళిక కాకుండా, స్థానిక అవసరాలు, అందుబాటులో ఉన్న నిధులను బట్టి ప్రాధాన్యతా క్రమంలో పనులను ఎంపిక చేయాలని మంత్రి తెలిపారు. గ్రామ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికలైన గ్రామసభలను సద్వినియోగం చేసుకుని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది రాష్ట్రంలో రూ.6,700 కోట్లు ఖర్చు చేస్తున్నామని, తద్వారా ప్రతి పంచాయతీలో సగటున రూ.50 లక్షల విలువైన పనులు జరిగే అవకాశం ఉందని చెప్పారు. పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడంతో పాటు, గ్రామాల్లో శాశ్వత సామాజిక ఆస్తులు సృష్టించేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.ఎల్‌నినో నేపథ్యంలో నీటి కొరతను నివారించేందుకు ‘జలసిరి’ కార్యక్రమాన్ని వేగవంతం చేసి, భూగర్భ జలాల పెంపునకు పెద్ద ఎత్తున పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అధికారులు కేవలం కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించడం కాకుండా గ్రామస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని స్పష్టం చేశారు. ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారులుగా నియమితులైన వారు రాబోయే రెండు రోజులు కేటాయించిన జిల్లాల్లో పర్యటించి, కింది స్థాయి సిబ్బందికి గ్రామసభలు, ఉపాధి హామీ, జలసిరి పనులపై అవగాహన కల్పించాలన్నారు. పర్వతారోహకులకు మంత్రి ఆర్థిక సాయం ఎవరెస్ట్ శిఖరాన్ని బిఅధిరోహించనున్న ఆదివాసీ (కోలాం, తోటి తెగల) పర్వతారోహకులను మంత్రి సీతక్క అభినందించారు. ఆసిఫాబాద్ జిల్లా బీమంగోండి గ్రామానికి చెందిన మడవి కన్నిబాయి(31), ఆదిలాబాద్ జిల్లా దూపార్పేట గ్రామానికి చెందిన కాత్లే ఆనంద్ రావు(23) త్వరలో ఎవరెస్ట్ యాత్ర ప్రారంభించనున్నారు. వీరికి మంత్రి సీతక్క వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందించారు. ఆదివాసీ బిడ్డలు ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా, జీవితంలోనూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.

## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



# రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్... శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని రాయదుర్గంలో ‘ఇందిరమ్మ టవర్స్’ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# లండన్ కాదు.. కోయంబత్తూరు, మధురైకి వెళ్లండి: సీఎం విజయ్‌కు అన్నామలై సూచన

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల లండన్‌లో పర్యటించడంపై రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్ర విమర్శలు చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)ను ‘చచ్చిపోయిన ఆర్థిక వ్యవస్థ’గా అభివర్ణించిన ఆయన, విదేశాల నుంచి కాకుండా రాష్ట్రం నుంచే పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.మధురైలో మీడియాతో మాట్లాడిన అన్నామలై.. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు 4.1 ట్రిలియన్ డాలర్లు కాగా, యూకే ఆర్థిక వ్యవస్థ కేవలం 3.4 ట్రిలియన్ డాలర్లు మాత్రమేనని గుర్తుచేశారు. కేవలం 1 శాతం వృద్ధి రేటుతో నెమ్మదిగా సాగుతున్న దేశానికి పెద్ద ప్రతినిధి బృందంతో వెళ్లడం వల్ల ప్రయోజనం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ అక్కడి నుంచి పెట్టుబడులు వచ్చినా, అవి ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న భారతీయ కంపెనీల అనుబంధ సంస్థల నుంచే వస్తాయని, కొత్తగా విదేశీ మూలధనం రాదని అభిప్రాయపడ్డారు. విదేశీ పర్యటనలకు బదులుగా, ముఖ్యమంత్రి రాష్ట్రంలోని పారిశ్రామిక కేంద్రాలైన కోయంబత్తూరు, మధురై, తూత్తుకుడి వంటి ప్రాంతాల్లో పర్యటించాలని అన్నామలై సలహా ఇచ్చారు. స్థానిక వ్యాపారవేత్తలతో సమావేశమై, వారి వ్యాపార విస్తరణకు పన్ను మినహాయింపులు వంటి ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అలాగే, దేశంలోని ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల నుంచి కూడా పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సీఎం విజయ్ ఆరు రోజుల యూకే పర్యటన ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 10,000కు పైగా ఉద్యోగాలు లభించాయని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అన్నామలై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి పనిచేయడానికి కొంత సమయం ఇవ్వాలని చెబుతూనే, స్థానిక పరిశ్రమల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు.

# జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ల మౌనం!

(మొదటి పేజీ తరువాయి)

స్థాయిలో స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన సంఘాలు తమ అసలు లక్ష్యాన్ని విస్మరిస్తున్నాయనే ఆగ్రహం పలువురు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తోటి జర్నలిస్టుపై చర్యలు, అరెస్టులు లేదా అన్యాయం జరిగిన సందర్భాల్లో సంఘాల నాయకత్వం నుంచి తగిన స్థాయిలో సంఘీభావ కార్యక్రమాలు కనిపించడం లేదని వారు అంటున్నారు.

తోటి జర్నలిస్టుకు అండగా నిలబడేదెవరు?

ఒక జర్నలిస్టు అరెస్టై జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడినప్పుడు ఎంతమంది జర్నలిస్టులు, సంఘాల నాయకులు అతనికి మద్దతుగా నిలుస్తున్నారు? సంఘ సభ్యత్వం, కార్యక్రమాల సమయంలో పెద్ద ఎత్తున సమీకరణలు చేసే నాయకత్వం, తోటి జర్నలిస్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఎందుకు ముందుకు రావడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.జర్నలిస్టుల మధ్య సమన్వయం, పరస్పర అవగాహన, ఐక్యత లేకపోతే చివరకు నష్టపోయేది మొత్తం జర్నలిజం వృత్తేనని పలువురు పేర్కొంటున్నారు. ఇతర రంగాల్లో తమ వర్గ ప్రయోజనాల కోసం ఐక్యంగా నిలబడే పరిస్థితి ఉన్నప్పటికీ, జర్నలిస్టుల విషయంలో మాత్రం విభేదాలు, గ్రూపిజం, వ్యక్తిగత ప్రయోజనాలు ముందుకు వస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పదవుల కోసమేనా సంఘాలు?

కీలక జర్నలిస్టు సంఘాల్లో పదవుల కోసం పోటీ పడుతున్న నాయకులు, అదే స్థాయిలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. పాలకులతో సంబంధాలు కొనసాగించడం కంటే జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడటం సంఘాల ప్రధాన బాధ్యతగా ఉండాలని జర్నలిస్టులు చెబుతున్నారు.ఎన్ని ప్రభుత్వాలు మారినా క్షేత్రస్థాయి జర్నలిస్టుల పరిస్థితుల్లో ఆశించిన మార్పు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతన భద్రత లేకుండా, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు తమ సమస్యలను మాత్రం బహిరంగంగా చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని పేర్కొంటున్నారు.

సొంత జిల్లాలో అన్యాయంపై స్పందనేది?

మారుమూల ప్రాంతాల్లో లేదా ఇతర జిల్లాల్లో జర్నలిస్టులకు జరిగిన ఘటనలపై స్పందించే వారు, తమ సొంత జిల్లాలో నిజాయితీగా పనిచేస్తున్న జర్నలిస్టుకు అన్యాయం జరిగినప్పుడు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈ విషయంలో సంఘాల మౌనం పలు అనుమానాలకు తావిస్తోందని జర్నలిస్టులు అంటున్నారు.

ప్రశ్నించడం జర్నలిస్టు హక్కు

వ్యవస్థలోని అవకతవకలను ప్రశ్నించడం జర్నలిస్టు బాధ్యత మాత్రమే కాకుండా వృత్తి ధర్మంలో భాగమని పలువురు పేర్కొంటున్నారు. అదే సమయంలో జర్నలిస్టు సంఘాల నాయకులు కూడా తమ సభ్యులకు జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.“కాకి కూతకు వంద కాకులు చేరతాయి.. జర్నలిస్టు కష్టంలో ఉన్నప్పుడు మాత్రం ఎందుకు ఐక్యత కనిపించదు?” అని పలువురు ప్రశ్నిస్తున్నారు. జర్నలిస్టులు పరస్పరం అండగా నిలబడి, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని వారు పిలుపునిస్తున్నారు.

రండి.. కదలిరండి.. ఐక్యంగా పోరాడుదాం

తోటి జర్నలిస్టుకు అన్యాయం జరిగినప్పుడు మౌనం వహించకుండా, న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని జర్నలిస్టులు కోరుతున్నారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి జర్నలిస్టుల హక్కులు, భద్రత, గౌరవం, వృత్తి ప్రయోజనాల కోసం సంఘాలు చురుగ్గా పనిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. జర్నలిస్టుల హక్కుల కోసం కలం ఒక్కటై గళం విప్పాలి!

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
సెప్టెంబర్ | మంగళవారం | 22 | 2026


# ఈ నెలాఖరులోగా 21వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ?

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 21**

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసంపూ ర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడకుండా పూర్తి చేసింది. ఈ క్రమంలో జీహెచ్ ఎంసీ పరిధిలోని 26 ప్రాంతాల్లో సుమారు 21 వేల డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ముగిశాయి. నగరంలోని నిరుపేద లకు ఈ ఇళ్లను పార దర్శకంగా అందించేం దుకు హౌసింగ్ శాఖ కసరత్తు వేగవంతం చేసింది. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ పై హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెలాఖరులోపు యుద్ధ ప్రాతిపదికన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని అధికారు లను ఆయన ఆదేశించారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా పూర్తిగా డ్రా విధానం లో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నా రు. అంతేకాకుండా, పారదర్శకత కోసం డ్రాలో ఎంపికైన వారి వివరాలను ఆన్‌లైన్ లో పొందుపరచాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపిక లో సరికొత్త నిబంధన ను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ప్రస్తుతం ఇళ్లు కేటాయించ నున్న ప్రాంతాలకు 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధి లో నివసిస్తున్న స్థానిక పేదలను గుర్తించి వారికే ఆ ఇళ్లను ప్రాధాన్యత



ఇవ్వాలని సూచించా రు.మరోవైపు, కొత్తగా ఇళ్లు అందుకునే కాలనీల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా విద్యుత్, తాగునీరు వంటి అన్ని మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని ఆదేశించారు.

# భీమిని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ





**మన దునియా, సెప్టెంబర్ 21,మంచిర్యాల జిల్లా**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో గల భీమిని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తాండూర్ సీఐ దేవయ్య,భీమిని ఎస్ఐ కోటేశ్వర్ పుష్పగుచ్చాలు అందించి డీసీపీకి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను,వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను డీసీపీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు.స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు, అప్‌లోడ్ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల ఫైళ్లు,క్రైమ్ రికార్డులు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతి,పెండింగ్ వ్యవహారాలపై సీఐ దేవయ్య,ఎస్ఐ భూమేష్‌లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను పెంపొందించుకోవడంతో పాటు, సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేసుకోవాలని సూచించారు.మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేయాలని తెలిపారు.ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని,సీసీ కెమెరాల అవసరం, ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.

# గణేష్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి ఇవ్వండి

**కేసీఆర్ పాటలంటే సర్కారుకెందుకంత భయం**

**జనతా గ్యారేజ్ క్రైం నెం:- 31 కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే వాహనాలకు అనుమతులు ఇవ్వాలని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి హోంమంత్రి కూడా అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డీజీపీ సీవీ ఆనంద్ కు విజ్ఞప్తిచేశారు. జనతా గ్యారేజ్ క్రైం నెం:- 31 కార్యక్రమంలో జీవన్ రెడ్డి సోమవారం మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదంటూ తనకు సందేశాలు వస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేసిన వెంటనే ఆ రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ జోక్యం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా డీజే వాహనాలకు అనుమతు లు మంజూరు చేసిన విషయాన్ని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. ఒక్క డీజే వాహనం కూడా సీజ్ చేయకూడదని పోలీసు శాఖకు లోకేష్ విజ్ఞప్తి చేశారన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కూడా అనుమతులు ఇచ్చారని, మహారాష్ట్ర లో కూడా అక్కడి ఫడ్నవీస్ ప్రభుత్వం డీజే వాహనాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆయన వివరించారు. అలాంటిది తెలంగాణ రాష్ట్రంలో డీజే వాహనాలకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ఆయన నిలదీశారు. కేవలం భక్తులు వాహనాలపై కేసీఆర్ పాటలు పెట్టుకొని డ్యాన్స్ లు చేస్తున్నారన్న అక్కసు తోనే డీజేలకు అనుమతులు నిరాకరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ పాటలంటే సర్కారుకెందుకంత భయం అని ఆయన ఎద్దేవా చేశారు. ఆర్మూర్ నుంచి అచ్చంపేట వరకూ గణేష్ నిమజ్జనంలో కేసీఆర్ పాటలే వినిపిస్తున్నాయన్నారు. ఇకనైనా సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి పరిమితులకు అనుగుణంగా గణేష్ నిమజ్జనం కార్యక్రమాలలో డీజేలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.



## పడుమర్రు వద్ద రోడ్డు ప్రమాదం

**మన దునియా దినపత్రిక (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 21**



చిలకలూరిపేట మండలం పడుమర్రు వద్ద చిలకలూరిపేట--ఓడరేవు హైవేపై సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.రోడ్డుకు అడ్డంగా స్కూటర్ తోవచ్చిన మహిళను తప్పించబోయిన కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది.పొలాల్లోకి దూసుకెళ్లింది ప్రమాద సమయంలో కారులో దంపతులతో పాటు ఆరేళ్ల బాలుడు ఉన్నారు.ఈ ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు పిఠాపురంలో పవన్ కళ్యాణ్ పర్యటన

**మన దునియా,అమరావతి:సెప్టెంబర్ 21**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రోజు లపాటు కాకినాడ జిల్లాలో పర్యటించ నున్నారు.కేరళంలో చికిత్స అనంతరం డిప్యూటీ సీఎం పవ న్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు.21,22 రెండు రోజుల పాటు ఈ నియోజక వర్గంలో విస్తృతంగా పర్యటించడంతో పాటు రూ.1500 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంగళవారం పిఠా పురంలోని ఆర్‌ఆర్‌బీ హెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆవర ణలో నిర్వహించే బహిరంగసభలో పవన్ ప్రసంగిస్తారు.

## మలక్ పేట్ లో పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్య?

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 21**




హైదరాబాద్ నగరం లోని మలక్ పేటలో పోలీస్ కానిస్టేబుల్ అనుమానస్పద మృతి కలకలం రేపింది,మూసారాంబాగ్ శాలివాహన నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. కానిస్టేబుల్ ముత్తె చంద్రశేఖర్(35) ఇంట్లో ఉరేసుకుని మృతిచెందాడు. అయితే చనిపోయే ముందు అర్ధరాత్రి ఓ యువతికి కానిస్టేబు ల్ వీడియో కాల్ చేసి నట్లు తెలుస్తోంది. తాను ఉరేసుకుంటు న్నట్లు యువతికి చెప్పాడు. ఆందోళన కు గురైన యువతి వెంటనే చైతన్యపురి పోలీసులకు సమా చారం అందించింది.చైతన్యపురి పోలీసు లు.. మలక్‌పేట్ పోలీసులకు సమా చారం ఇవ్వడంతో వెంటనే వారు ఘట నా స్థలికి చేరుకున్నా రు.ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే కానిస్టేబుల్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపిం చాడు. దీంతో పోలీ సులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమి త్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు చంద్రశేఖర్ అంబర్‌పేట్ హెడ్ క్వార్టర్స్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. అయితే కానిస్టేబుల్ మృతికి పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సూర్యాపేట జిల్లాలో డీజేలపై పూర్తి నిషేధం - ఎస్పీ నరసింహ

**మన దునియా,సూర్యాపేట: సెప్టెంబర్ 21**




సూర్యాపేట: జిల్లా వ్యాప్తంగా డీజే సౌండ్ సిస్టంలపై పూర్తిగా నిషేధం విధించినట్లు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. నిన్న ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పండగైనా, ఉత్సవమైనా, పెళ్లయినా, పుట్టినరోజైనా డీజే శబ్దాలు లేకపోతే హుషారు లేదనుకునే పరిస్థితి నెలకొందని, అయితే ఇలాంటి అధిక శబ్దాలతో ప్రాణాలకు ముప్పు ఉందన్నారు.పరిమితికి మించిన డెసిబెల్ శబ్దాలకు ఎక్కువసేపు గురికావడం వల్ల వినికిడి లోపం, తలనొప్పి, నిద్రలేమి, ఒత్తిడి, రక్తపోటు, గుండెపోటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణీ స్త్రీలు అధిక శబ్దం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అధిక శబ్దాలపై నిషేధిత నిబంధనలు అమల్లో ఉన్నాయని, శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు డీజే సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.సంతోషాన్ని పంచుకోవడం తప్పు కాదు.. కానీ మన సంతోషం మరొకరికి బాధ కలిగించకూడదు. పరిమిత శబ్దంతో ఉత్సవాలను నిర్వహిస్తూ ప్రశాంతమైన వాతావరణాన్ని కాపాడుకుందాం అని ఎస్పీ నరసింహ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 15 వేలులంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఎస్టాబ్లిష్ మెంట్ ఆడిట్ సెక్షన్ లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ , కంప్యూటర్ ఆపరేటర్ 15000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఎస్టాబ్లిష్మెంట్ ఎడిట్ సెక్షన్లో ఉద్యోగుల జీతభత్యాలు మెడికల్ రిమెంబర్ వంటి వ్యవహారాలు జరుగుతుంటాయి ఇదే విభాగంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ అశోక్, కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న కిరణ్ ఓ బిల్లు విషయంలో బాధితునీ నుండి 15000 లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## సముద్రంలో మునిగిన మత్స్యకారుల బోటు

**మన దునియా,అమరావతి:సెప్టెంబర్ 21**



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తీరంలో పెను ప్రమాదం తప్పింది. భైరవపాలెం మొగ వద్ద సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు ప్రమాదవశాత్తు మునిగిపోయింది. అయితే సమీపం లోని మరో బోటు సిబ్బంది సకాలంలో స్పందించడంతో అందులోని తొమ్మిది మంది మత్స్యకారు లు ప్రాణాలతో సురక్షితంగా బయట పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. భైరవపాలెం గ్రామానికి చెందిన చింత శ్రీనుకు చెందిన బోటుపై తొమ్మిది మంది మత్స్యకారు లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. ఈరోజు తెల్లవారుజామున భైరవపాలెం మొగ ప్రాంతానికి చేరుకునే సరికి సముద్రంలో ఈదురు గాలుల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. అలల ఉధృతికి బోటు అదుపుతప్పి నీట మునిగింది.బోటు మునిగి పోతున్న సమయం లో అందులోని మత్స్యకారులు ప్రాణభయంతో కేకలు వేశారు. ఆ సమయం లో అటుగా వస్తున్న మరో వేట బోటులోని జాలర్లు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. నీటిలో మునిగిపో తున్న తొమ్మిది మందిని తమ బోటు లోకి ఎక్కించుకుని ఒడ్డుకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ప్రాణనష్టం తప్పిన ప్పటికీ, బోటుతో పాటు వలలు, వేట సామగ్రి సముద్రంలో మునిగిపోవడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ లో రూ"10 కోసం ఆటో డ్రైవర్ హత్య?

**మన దునియా,హైదరాబాద్: సెప్టెంబర్ 21**



హైదరాబాద్ పాత బస్తీ ఆటో డ్రైవర్ హత్య కలకలం రేపింది నగరంలోని వట్టేపల్లి నైస్ హోటల్ సమీపంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు సమాచారం. రూ.10 చిల్లర విషయంలో తలెత్తిన వివాదం.. ఓ ఆటో డ్రైవర్ ప్రాణా లను బలిగొంది. మొహమ్మద్ ముక్రం అనే ఆటో డ్రైవర్‌పై అజీమ్, షోయబ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.తీవ్ర గా యాలతో ముక్రంను ఆస్పత్రికి తరలించ గా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో స్థాని కంగా తీవ్ర కలకలం నెలకొంది. మృతదేహా న్ని పోస్టు మార్టం నిమిత్తం పోలీ సులు ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.ఈ ఘటనపై ఫలక్ నుమా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తుచేపట్టారు. దాడికి పాల్పడిన వారిలో అజీమ్ అనే వ్యక్తి యూట్యూబర్ గా పోలీసులు గుర్తిం చినట్లు సమాచారం. రూ.10 చిల్లర విష యంలో ప్రారంభమైన వివాదం చివరకు దాడి, హత్యకు దారితీయడం స్థాని కంగా సంచలనం సృష్టించింది. ఘటనకు సంబంధిం చిన పూర్తి వివరాల ను పోలీసులు సేకరిస్తున్నారు. నింది తులు ఎంతమంది ఉన్నారు, దాడికి ఖచ్చితమైన కారణాలు ఏమిటనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ఇందిరమ్మ ఇళ్లలో ఆరోపణలు...

- **దేవనగర్ గ్రామపంచాయతీ కార్యదర్శిపై చర్యలు ఉండేనా?**
- **ఒక్కో లబ్ధిదారుడి దగ్గర రూ.5 వేల చొప్పున తీసుకున్నారంటున్న లబ్ధిదారులు...అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి?**

**మన దునియా,ములుగు జిల్లా,మల్లంపల్లి,దేవనగర్: సెప్టెంబర్ 21**

దేవనగర్: గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి వసూళ్లు చేశారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఒక్కో లబ్ధిదారుడి వద్ద రూ.5 వేల చొప్పున తీసుకున్నారని కొందరు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వసూళ్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

బిల్లుల విషయంలోనే వసూళ్లా?

ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు, ముఖ్యంగా బిల్లుల విషయంలో తమ నుంచి డబ్బులు తీసుకున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలను అధికారిక విచారణ ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి?

లబ్ధిదారుల నుంచి వసూళ్ల ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఆరోపణలు నిజమా? కాదా? తేల్చేందుకు విచారణ చేపడతారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

కార్యదర్శిపై చర్యలు ఉంటాయా?

దేవనగర్ గ్రామపంచాయతీ కార్యదర్శిపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.5 వేల చొప్పున వసూళ్లు జరిగాయనే ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఆరోపణలపై విచారణ ఎప్పుడు?

వసూళ్లు నిజమేనా?

అధికారులు స్పందించేది ఎప్పుడు?

కార్యదర్శిపై చర్యలు ఉంటాయా?




# రోడ్లపై ధాన్యం, మక్కలు ఆరబెట్టడం ప్రమాదాలకు కారణం -- కమ్మరపల్లి ఎస్ఐ సతీష్





**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ కమ్మరపల్లి మండల పరిధిలోని ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులపై మక్కలు మొక్కజొన్నలు వడ్లు మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టవద్దని కమ్మరపల్లి ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ. రైతులకు సూచించారు.రోడ్లపై ధాన్యం, మక్కలు పోసి ఆరబెట్టడం వల్ల వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరియు రైతులు, వాహనాలు అదుపుతప్పి స్కిడ్ కావడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి ఘటనలు కొన్నిసార్లు ప్రాణనష్టానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.రహదారులు ప్రజలు, వాహనాలు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు ఉద్దేశించినవని, వాటిపై వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాల ముప్పు పెరుగుతుందని ఎస్ఐ తెలిపారు.రైతులు తమ పంట ఉత్పత్తులను రోడ్లపై కాకుండా కల్లాలు డ్రయింగ్ యార్డ్స్ తమ వ్యవసాయ భూములు లేదా వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఆరబెట్టుకోవాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.ప్రజలు, రైతులు మరియు వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కమ్మరపల్లి మండల ప్రజలు, రైతులు సహకరించాలని కమ్మరపల్లి ఎస్ఐ . సతీష్ కోరారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు!

**మన దునియా,హైదరాబాద్: సెప్టెంబర్ 21**



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు కేసులో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు హైకోర్టు అధికారిక నోటీసులు జారీ చేసింది.

విధులు నిర్వర్తిస్తున్న పోలీసులపై దాడి.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు

విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపించారు. రాజ్యాంగబద్ధమైన శాసనసభ స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించారని కోర్టుకు తెలిపారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా ఎమ్మెల్సీలు దాడులకు పాల్పడ్డారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలిద్దరి అరెస్టు, రిమాండ్‌ను అడ్డుకుంటూ నాంపల్లి దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టును కోరారు.

విచారణ వాయిదా

ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన తెలంగాణ హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలను కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో తదుపరి విచారణను ధర్మాసనం ఎల్లుండికి వాయిదా వేసింది..

# కొత్త పింఛన్ల ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలి**

**ఇందిరమ్మ ఇండ్ల నా3 అంశం పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

కొత్త పింఛన్ల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అధికారులను సూచించారు. అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు.నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, ధర్పల్లి మండలాల ఎంపీడీఓలతో సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పింఛన్ల ఎంపిక, గృహనిర్మాణం, మండల పరిషత్ కార్యాలయాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు.కొత్త పింఛన్లకు సంబంధించి అర్హత కలిగిన వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి ఎంపిక చేయాలని ఎమ్మెల్యే సూచించారు. లబ్ధిదారుల ధృవపత్రాలు, అర్హతలకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, వెరిఫికేషన్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.అదేవిధంగా గృహనిర్మాణానికి సంబంధించి అర్హత ఉన్నప్పటికీ పొరపాటున నా3 జాబితాలో ఉన్న లబ్ధిదారులను గుర్తించి, నిబంధనల ప్రకారం నా1 జాబితాలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన పేదలకు గృహ నిర్మాణ ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు.మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల ఎంపీడీఓ పరిస్థితిపైనా సమీక్షలో చర్చించారు. శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలను గుర్తించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని, భవనాలు పూర్తిగా అనుకూలంగా లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ప్రదేశాలకు కార్యాలయాలను మార్చే అంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజలకు, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా.. భూపతి రెడ్డి సూచించారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# తెలంగాణకు వర్ష సూచన.. వారం రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు

**మన దునియా,హైదరాబాద్, సెప్టెంబర్ 21**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడే అవకాశం ఉన్నందున తెలంగాణలో ఈరోజు(ఆదివారం) నుంచి వారం రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఈ మేరకు రాష్ట్రంలోని 24 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది.

ఈరోజు గంటకు 40-50 కి. మీ వేగంతో రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులు వీస్తాయని.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.నేడు(సోమవారం)రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వారు వెల్లడించారు.

వాయుగుండంగా మారే అవకాశం..

ప్రస్తుతం అల్పపీడనం ఉత్తర అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని




ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇది సెప్టెంబర్ 21న వాయుగుండంగా, 22న తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 23 ఉదయం నాటికి దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు సమీపంలోని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో 20, 21, 22, 23, 24, 25వ తేదీల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# ఎర్రవల్లిలో 100 మంది రైతులకు నోటీసులు

**సర్వే నంబర్ 325లో భూములున్న అందరికీ అందజేత**
**జాగాకు సంబంధించిన ఆధారాలతో రావాలని సూచన**
**ఎర్రవల్లిలో మూడోరోజు రెవెన్యూ అధికారుల సర్వే**
**శివారు వెంకటాపూర్ రైతుల అభ్యంతరాలు**

**మన దునియా,సిద్దిపేట/ములుగు:సెప్టెంబర్ 21**

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 325లో భూములున్న వంద మంది రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 21న భూమికి సంబంధించిన ఆధారాలతో రావాలని సూచించారు. రైతుల వారీగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించేందుకు ఈ నోటీసులు జారీ చేశారు. ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో రెవెన్యూ అధికారులు మూడో రోజూ సర్వే నిర్వహించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని 325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో దాదాపు 160 మంది రైతులకు పట్టాలున్నాయి.వీరిలో బీసీ, ఎస్సీలే అధికంగా ఉన్నారు. శనివారం గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, సర్వే ఏడీ సుదర్శన్‌ల నేతృత్వంలో ఐదు ప్రత్యేక టీమ్‌లు ఎర్రవల్లి సమీపంలోని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. 325 సర్వే నంబర్‌లోని 388 ఎకరాల భూ హద్దులపై సర్వే పూర్తి చేశారు. అనంతరం ఎర్రవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీవో ఆధ్వర్యంలో 325 సర్వే నంబర్‌లో భూములున్న వంద మంది రైతులకు నోటీసులు అందజేశారు. రైతులు ఈ నెల 21న ఆధారాలతో వచ్చిన తర్వాత వారి భూముల హద్దులను కూడా పరిశీలించనున్నారు. ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్ గ్రామాల్లోని భూములతో పాటు 325 సర్వే నంబర్‌లోని భూముల హద్దులను గత రెండు రోజులుగా ప్రత్యేక టీమ్‌ల ద్వారా నమోదు చేశారు. శనివారం ఆయా గ్రామాల పరిధిలోని భూములను ప్రత్యేక టీమ్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. అనంతరం మర్కుక్ తహసీల్దార్ ఆఫీస్‌లో సర్వే బృందాలు సమావేశమై అప్పటి వరకు సేకరించిన వివరాలు, మ్యాప్‌లను పరిశీలించాయి.




కాస్రా, సేత్వార్ ప్రకారం సర్వే చేయండి..

ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌజ్ సమీప గ్రామాల్లో రెవెన్యూ ఆఫీసర్లు భూములను సర్వే చేస్తుండగా శివారు వెంకటాపూర్ రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్ హౌజ్ సమీపంలోని325 సర్వే నంబర్ లో 388 ఎకరాలుంటే ఇందులో 180 ఎకరాలు శివారు వెంకటాపూర్ గ్రామానికి సంబందించినవేనన్న విషయాన్ని రైతులు అధికారులకు తెలియజేశారు.మొత్తం 388 ఎకరాల్లో 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లి గ్రామస్తులవని, మిగిలిన 180 ఎకరాలు శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందినవైతే వాటిని కూడా ఎర్రవల్లి గ్రామంలో కలుపుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే వల్ల తమకు అన్యాయం జరగుతుందని కాస్రా, సెత్వార్ రికార్డుల ప్రకారం సర్వే చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదం వల్లే భూ రికార్డుల్లో తప్పులు నమోదు అయ్యాయని, శివారు వెంకటాపూర్ గ్రామంలోని దాదాపు 20 సర్వే నంబర్లలోని భూమి 325 సర్వే నంబర్ లో ఉన్నట్లుగా చూపిస్తున్నారని ఈ విషయంలో తమకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

# పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి: డిచ్‌పల్లి సీఐ వినోద్







**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లా: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిది లో సి ఐ వినోద్. డిచ్పల్లి జక్రాన్ పల్లి ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీ.ఐ వినోద్ మాట్లాడుతూ శాంతి భద్రతలు, ప్రజల మధ్య సోదరభావం, పరస్పర సామరస్యంపై సభ్యులకు సూచనలు చేశారు. రాబోయే పండుగలు, పండుగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీ.ఐ వినోద్ సూచించారు.మత సామరస్యాన్ని కాపాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, వాటిని ప్రచారం చేయవద్దని సూచించారు.ఐజీ లు పూర్తిగా నిషేధం అని, ఎవరైనా పెడితే కేసు నమోదు చేసి చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.ఐ ఆరిఫ్, పోలీస్ సిబ్బంది,శాంతి కమిటీ సభ్యులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా కుట్రలు

**శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి**
**బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో సైతం రిజర్వేషన్లు కల్పించాలి**
**బీసీ సంక్షేమ సంఘం నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య**



**మన దునియా,కాచిగూడ, సెప్టెంబర్ 20**

ప్రజాస్వామ్యానికి బీసీలే పునాదిరాళ్లు అని, అలాంటి బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా అగ్రవర్ణాలు కుట్రలు పన్నుతున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. ఆదివారం కాచిగూడలో జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశానికి మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని శాసించేది రాజ్యాధికారం, డబ్బేనని, అవి ఉన్నవారే నేటి సమాజంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలు ఎదగకుండా కులాల వారీగా విభజించి అణగదొక్కుతున్నారని, అందుకు వ్యతిరేకంగా బీసీలంతా ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. 'బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్‌ను తక్షణమే తొలగించాలి. కేంద్రస్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటుచేయాలి' అని డిమాండ్ చేశారు. తెలంగాణ ఓబీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు దానకర్ణచారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రవికుమార్ ముదిరాజ్, రామరాజ్, అల్లం యాదయ్య, చెన్నయ్య, జీ మల్లేశ్, సీ రామమూర్తి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, ప్రదీప్, నగేశ్‌రాజ్, గౌతం, నీలం వెంకటేశ్, సీ రాజేందర్, నిఖిల్ పాల్గొన్నారు.

# గణపవరం జాతీయ రహదారిపై స్పీడ్ బారికేడ్ల ఏర్పాటు



**మన దునియా దినపత్రిక (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 21**

నాదెండ్ల: నాదెండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గణపవరం జాతీయ రహదారిపై వాహనాల అతివేగాన్ని అరికట్టి, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. సీఐ సుబ్బ నాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఏఎస్ఐ రమేష్, రైటర్ అనిల్ సిబ్బందితో కలిసి రోడ్డుపై రిఫ్లెక్టర్లతో కూడిన స్పీడ్ బారికేడ్లను (డ్రమ్ములను) సోమవారం ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో సైతం వాహనదారులకు స్పష్టంగా కనిపించి వారిని అప్రమత్తం చేసేలా ఈ డ్రమ్ములకు రేడియం స్టిక్కర్లు, లైటింగ్ సదుపాయాన్ని అమర్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మితమైన వేగంతో వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎన్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# కామారెడ్డిలో అబ్బురపరుస్తున్న గణేష్ మండపాల సెట్టింగులు











**ఉమ్మడి,నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

ఈ ఏడాది వినాయక మండపాల్లో భక్తితో పాటు క్రియేటివిటీ కూడా కొలువుదీరింది. కామారెడ్డి లో ఏర్పాటు చేసిన వివిధ గణపతి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.కామారెడ్డి గణేష్ మండప్స్ పట్టణంలో హల్క్? అవతారంలో..పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సెట్టింగ్?లో హల్క్ అవతారంలో గణపతి కనిపిస్తే, పక్కనే స్పైడర్ మ్యాన్, సూపర్ మ్యాన్, కెప్టెన్ అమెరికా వంటి అవెంజర్స్ హీరోలు ఉన్నారు. మరో మండపంలో పిల్లనగ్రోవి పట్టుకుని జగన్నాథుడి రూపంలో, నల్లని ఛాయతో కృష్ణ తత్వాన్ని చాటుతూ గణనాథుడు దర్శనమిస్తున్నాడు. హరిజనవాడలో వానర సేనతో, చెట్టు కొమ్మలపై కోతుల మధ్య కొంటెగా నవ్వుతూ కూర్చున్న బాల గణపతి సెట్టింగ్ చిన్నారులను అలరిస్తోంది. ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా నిలిచే గణేషుల్లో గొల్లవాడ గణేష్ ఒకటి. ఈసారి శివతత్వాన్ని చాటేలా ద్వాదశ జ్యోతిర్లింగాల మధ్య, నీటిపై లింగాలతో, డమరుకాలు గాల్లో వేలాడుతూ ఏర్పాటు చేసిన మండపం, రుద్రాక్షలతో అభిషేకం చేస్తున్న రుద్ర గణపతి, ఆదియోగి రూపంలో పార్వతీ సమేతంగా తపస్సులో ఉన్న గణపతి విగ్రహాలు ఆధ్యాత్మికతను పంచుతున్నాయి.

కామారెడ్డి గణేష్ మండప్స్ । స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి సెట్టింగ్?..

అన్నింటిలోకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది స్వర్ణగిరి ఆలయం సెట్టింగ్. ఎన్జీవోస్ కాలనీలోని ఓ మండపం లోపల అచ్చం భువనగిరి స్వర్ణగిరి వేంకటేశ్వర ఆలయాన్ని ప్రతిరూపంగా నిర్మించారు. ఇందులో ముందు భాగంలో పెద్ద వేంకటేశ్వర స్వామి విగ్రహంతో పాటు, మధ్యలో నీలిరంగు నీటిపై ఆదిశేషునిపై శయనించిన విష్ణుమూర్తి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. అనంత పద్మనాభ స్వామి రూపంలో సేదతీరుతున్న విష్ణుమూర్తి, వెనుక నిలుచున్న నల్లరాతి వేంకటేశ్వర స్వామి, గర్భగుడిలో బంగారు కిరీటంతో కొలువైన భారీ గణపతి -- ఒకే మండపంలో ముగ్గురు దేవుళ్ల దర్శనం లభించడంతో భక్తులు క్యూ కట్టి మరీ తిలకిస్తూ ఫొటోలు దిగుతున్నారు.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్.. ధోనీ నిర్ణయమన్న కాశీవిశ్వనాథ్

**సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్ నియామకం**

**స్టీఫెన్ ఫ్లెమింగ్ 18 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు**

**కోచ్ ఎంపికలో ఎంఎస్ ధోనీదే కీలక నిర్ణయమని వెల్లడి**

**ఆటగాడిగానే ధోనీ కొనసాగుతాడని తెలిపిన యాజమాన్యం**

**డిసెంబర్ మినీ వేలంపై దృష్టి సారించనున్న జహీర్**

ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ నూతన ప్రధాన కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్‌ను నియమించింది. గత 18 ఏళ్లుగా జట్టుతో అనుబంధం ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో జహీర్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఐపీఎల్ 2027 సీజన్ వరకు ఈ నియామకం అమల్లో ఉంటుందని ఫ్రాంచైజీ సోమవారం వెల్లడించింది. ఈ కీలక నిర్ణయంలో వెటరన్ సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీ ప్రధాన పాత్ర పోషించినట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ నియామకంపై సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ, "క్రికెట్ మేనేజ్‌మెంట్ సమష్టిగా ఈ నిర్ణయం తీసుకుంది. జహీర్ ఖాన్‌కు ఉన్న అపార అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని అతడిని ప్రధాన కోచ్‌గా ఎంపిక చేశాం. ఐపీఎల్‌లో వందకు పైగా మ్యాచ్‌లు ఆడిన అనుభవం అతడికి ఉంది. ఈ ఎంపిక ప్రక్రియలో ఎంఎస్ ధోనీ కూడా పాలుపంచుకున్నాడు. ధోనీ సలహా లేకుండా మేం ఎటువంటి నిర్ణయాలు తీసుకోం" అని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు యజమాని రూపా గురునాథ్ కూడా భాగస్వాములయ్యారు. 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక సభ్యుడైన జహీర్ ఖాన్, గతంలో ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా, లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా సేవలందించాడు. ఒక ఐపీఎల్ జట్టుకు అతడు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటిసారి. తన సహాయక సిబ్బందిని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛను జహీర్‌కు కల్పించినట్లు యాజమాన్యం పేర్కొంది. ప్రస్తుత ఒప్పందం ప్రకారం ఏడాది కాలానికి ఈ నియామకం జరిగినట్లు సమాచారం. ఇక ధోనీ భవిష్యత్తు గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "అతడు మా జట్టులో ఆటగాడిగానే కొనసాగుతాడు" అని విశ్వనాథన్ బదులిచ్చారు. గత మూడు సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన సీఎస్‌కే, జహీర్ మార్గదర్శకత్వంలో తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని ఆశిస్తోంది. డిసెంబర్‌లో జరగనున్న మినీ వేలం ద్వారా పటిష్ఠమైన జట్టును సిద్ధం చేయడం ఇప్పుడు జహీర్ ముందున్న తక్షణ కర్తవ్యం.




# చెన్నై సూపర్ కింగ్స్ కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్.. భారతీయుడే ఉండాలన్న ధోనీ!

**చెన్నై సూపర్ కింగ్స్ కు కొత్త హెడ్ కోచ్ నియామకం**

**స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్న జహీర్ ఖాన్**

**భారత కోచ్ ఉండాలన్న ధోనీ సూచన మేరకే ఈ నియామకం**

**జట్టులో భాగం కావడం గౌరవంగా ఉందన్న జహీర్**

**జహీర్ రాకను ధృవీకరించిన సీఎస్‌కే యాజమాన్యం**



ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ జట్టులో కీలక మార్పులు చేపట్టింది. భారత పేస్ దిగ్గజం జహీర్ ఖాన్‌ను 2027 సీజన్‌కు కొత్త హెడ్ కోచ్‌గా నియమించినట్లు సోమవారం అధికారికంగా ప్రకటించింది. గత 18 ఏళ్లుగా జట్టుతో అనుబంధం పెనవేసుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానాన్ని జహీర్ భర్తీ చేయనున్నాడు. వరుసగా మూడు సీజన్లలో సీఎస్‌కే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమవడంతో స్టీఫెన్ ఫ్లెమింగ్ తన పదవి నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. అనంతరం అతడు ఇంగ్లండ్ పురుషుల టెస్ట్ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఫ్లెమింగ్ నిష్క్రమణ తర్వాత సీఎస్‌కే యాజమాన్యం పలువురు అభ్యర్థులతో విస్తృత చర్చలు జరిపింది. జట్టుకు భారతీయ కోచ్ అయితేనే బాగుంటుందని, స్థానిక ఆటగాళ్లు, పరిస్థితులపై అతనికి మంచి అవగాహన ఉంటుందని సీఎస్‌కే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గట్టిగా సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే జహీర్ ఖాన్ నియామకం జరిగినట్లు తెలుస్తోంది. ఈ నియామకంపై జహీర్ ఖాన్ హర్షం వ్యక్తం చేశాడు. "ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన సీఎస్‌కేలో భాగం కావడం నాకు దక్కిన గౌరవం. ఒక క్రికెటర్‌గా నేను సీఎస్‌కేతో మైదానంలో తలపడ్డాను. చెపాక్‌లో సూపర్‌ఫ్యాన్స్ సృష్టించే వాతావరణం చాలా ప్రత్యేకం. గొప్ప చరిత్ర ఉన్న ఈ ఫ్రాంచైజీతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని జహీర్ ఒక ప్రకటనలో తెలిపాడు. జహీర్ నియామకాన్ని సీఎస్‌కే ఓనర్ రూపా గురునాథ్ నిర్ధారించారు. "జహీర్ ఖాన్‌ను హెడ్ కోచ్‌గా ధృవీకరిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఆటగాడిగా అతనికి ఉన్న అపార అనుభవం, యువ ప్రతిభను ప్రోత్సహించడంలో అతనికి ఉన్న నైపుణ్యం మా జట్టుకు ఎంతో విలువైనది. అతని మార్గనిర్దేశంలో ఫ్రాంచైజీ మరింత బలపడుతుందని విశ్వసిస్తున్నాం" అని ఆమె పేర్కొన్నారు. భారత్ 2011 వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన జహీర్ ఖాన్, తన 14 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 92 టెస్టులు, 200 వన్డేలు, 17 టీ20లలో కలిపి 610 వికెట్లు పడగొట్టాడు. గతంలో ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా, లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గానూ పనిచేశాడు. "జహీర్ ఒక ప్రపంచ స్థాయి బౌలర్. అతని క్రికెట్ పరిజ్ఞానం అపారమైనది. మా కుటుంబంలోకి అతనికి స్వాగతం పలుకుతున్నాం" అని సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు.

# ఏషియన్ గేమ్స్‌లో కొత్త చరిత్ర.. భారత్‌కు తొలి ఎంఎంఏ మెడల్!



**తొలిసారి ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్**

**భారత్‌కు పతకాన్ని అందించిన సుచికా తారియాల్**

**మహిళల ట్రెడిషనల్ 60 కేజీల విభాగంలో సుచికాకు కాంస్య పతకం**

**సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో ఓటమి**

**జూడో, జియూ-జిట్సులోనూ సుచికాకు ప్రావీణ్యం**

భారత మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో సుచికా తారియాల్ చరిత్ర సృష్టించింది. ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు ఎంఎంఏలో తొలి పతకాన్ని అందించిన క్రీడాకారిణిగా నిలిచింది. సోమవారం జరిగిన మహిళల ట్రెడిషనల్ 60 కేజీల విభాగంలో సుచికా.. కాంస్య పతకం సాధించింది. ఏషియన్ గేమ్స్‌లో ఈసారే ఎంఎంఏ తొలిసారి చోటు దక్కించుకుంది. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో సుచికా తలపడింది. హోరాహోరీగా సాగిన ఈ పోరు అదనపు సమయంలోకి వెళ్లింది. చివరకు స్వల్ప తేడాతో సుచిక ఓటమి పాలైంది. దీంతో ఫైనల్‌కు చేరే అవకాశం కోల్పోయినా.. అప్పటికే కాంస్య పతకం ఖాయమైంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో మంగోలియాకు చెందిన అల్టాన్‌చిమెగ్ బైగల్మాను 2-0తో సుచికా ఓడించింది. దీంతో ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏలో భారత్‌కు పతకం ఖాయం చేసిన తొలి క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. 36 ఏళ్ల సుచికా ప్రయాణం ఒక్క ఎంఎంఏకే పరిమితం కాలేదు. జాతీయ స్థాయి జూడో క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంది. 2023 ఏషియన్ గేమ్స్‌లో కురాష్‌లోనూ పోటీ పడింది. ఆ తర్వాత జియూ-జిట్సులో సత్తా చాటి 2024లో ఫైటింగ్ జియూ-జిట్సు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. 2017లో ఎంఎంఏలో ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన సుచికా.. జూడో, జియూ-జిట్సుపై దృష్టి పెట్టడంతో కొన్నేళ్లు ఈ క్రీడకు దూరంగా ఉంది. 2024లో మళ్లీ ఎంఎంఏలోకి వచ్చి 'బ్రేవ్ కంబాట్ ఫెడరేషన్'తో ఒప్పందం చేసుకుంది. గాయం వంటి అడ్డంకులను అధిగమించి తిరిగి వచ్చిన ఆమె.. ఇప్పుడు ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు చారిత్రక పతకం అందించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏ తొలిసారి ప్రవేశించిన వెంటనే భారత్ కు పతకం రావడం విశేషం. ఈ ఘనత భారత ఎంఎంఏ చరిత్రలో సుచికా తారియాల్‌కు ప్రత్యేక స్థానం కల్పించింది.

# కోహ్లీ, ధోనీ, డివిలియర్స్‌ను కాదని కుర్రాడిని ఎంచుకున్న సూర్య

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీ, ఏబీ డివిలియర్స్.. క్రికెట్‌లో ఈ దిగ్గజాల పేర్లు తెలియని అభిమానులు ఉండరు. కానీ వీరందరి నుంచి ఒక్క నైపుణ్యం ఎంచుకోమంటే భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం ఓ 15 ఏళ్ల కుర్రాడిని ఎంచుకున్నాడు. అతడే వైభవ్ సూర్యవంశీ. ఈ యువ బ్యాటర్ సిక్సర్లు కొట్టే నైపుణ్యాన్ని తాను తీసుకోవాలనుకుంటున్నట్లు సూర్య తెలిపాడు. 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్యకుమార్‌ను ఇదే ప్రశ్న అడిగారు. దానికి సమాధానంగా.. 'వైభవ్ సూర్యవంశీ అనే ఓ కుర్రాడి గురించి మీరు వినే ఉంటారు. అతడి సిక్సర్లు కొట్టే నైపుణ్యాన్ని కచ్చితంగా తీసుకుంటా' అని చెప్పాడు. ఐపీఎల్ 2026లో వైభవ్ సంచలన ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. 16 మ్యాచుల్లో 776 పరుగులు చేశాడు. 237.31 స్ట్రైక్‌రేట్‌తో పరుగుల వరద పారించాడు. అత్యధిక పరుగులతో ఆరెంజ్ క్యాప్ దక్కించుకోవడంతో పాటు మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ అవార్డునూ అందుకున్నాడు. టోర్నీలో ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో ఒక ఆటగాడు కొట్టిన అత్యధిక సిక్సర్లు ఇవే. మరోవైపు సూర్యకుమార్‌కు ఐపీఎల్ 2026 కలిసిరాలేదు. 12 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 270 పరుగులు చేశాడు. ముంబయి ఇండియన్స్ పది జట్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శన తర్వాత సూర్యకుమార్ కెప్టెన్సీ కోల్పోయాడు. భారత టీ20 జట్టులోనూ చోటు కోల్పోయాడు. అయితే ఐపీఎల్ 2027లో సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్‌లోనే కొనసాగనున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఇదిలా ఉంటే.. ఐపీఎల్‌లో అదరగొట్టిన వైభవ్ భారత టీ20 జట్టులోకి కూడా వచ్చాడు. ప్రస్తుతం ఆసియా క్రీడలు 2026 కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ అతడు ఉన్నాడు.





మన దునియా
RNI Number TTITTI/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

## వెంకీ 'ఆదర్శ కుటుంబం' నుంచి ఫస్ట్ సింగిల్.. డేట్ ఫిక్స్!



విక్టరీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని మొదటి పాట 'నారాయణమ్మ'ను రేపు(సెప్టెంబర్ 22న) విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలోని 'నారాయణమ్మ' పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. ఇది ఒక మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్‌గా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై వెంకటేశ్ అభిమానుల్లో, సాధారణ ప్రేక్షకుల్లో భారీ ఆశలు నెలకొని ఉన్నాయి.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో ఇద్దరు భామలు నివేదా పేతురాజ్, డింపుల్ హయాతి ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## సోదరి అంబికపై నటి రాధ సంచలన ఫిర్యాదు

**రూ. 46 కోట్ల కోసం తన చెక్కులను దుర్వినియోగం చేశారని ఆరోపణ**

**ఇంట్లో ఉంచిన బ్లాంక్ చెక్కులను దొంగిలించారని ఫిర్యాదు**

**ఏడాదిన్నరగా తన ఆస్తిలోకి అడుగుపెట్టనివ్వడం లేదని ఆవేదన**

ప్రముఖ నటి రాధ కుటుంబంలో ఆర్థిక వివాదం చెలరేగింది. తన సోదరి, నటి అంబిక, సోదరుడు మల్లికార్జున కుంజన్ నాయర్‌లపై రాధ సంచలన ఆరోపణలు చేశారు. తన సంతకం కలిగిన బ్లాంక్ చెక్కులను ఉపయోగించి రూ. 46 కోట్లు కాజేసేందుకు వారు ప్రయత్నించారని ఆరోపిస్తూ సెప్టెంబర్ 21న చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో రాధ పేర్కొన్న వివరాల ప్రకారం.. వ్యాపార అవసరాల నిమిత్తం ఆమె 'ఏఆర్ఎస్ గార్డెన్ స్టూడియో' పేరుతో ఉన్న ఐడీబీఐ బ్యాంకు కరెంట్ ఖాతాను నిర్వహిస్తున్నారు. సిబ్బంది వేతనాలు, పన్నులు, ఇతర ఖర్చుల కోసం కొన్ని చెక్కులపై ముందుగానే సంతకం చేసి చెన్నైలోని తన నివాసంలో ఉంచేవారు. 2025 జనవరి నుంచి ఈ సంస్థ పేరు 'ఆర్ఆర్ గార్డెన్స్'గా మారనున్న నేపథ్యంలో పాత చెక్కుల వాడకాన్ని నిలిపివేశారు. అయితే, ఆ పాత చెక్కు పుస్తకంలోని ఐదు చెక్కులను తన సోదరుడు మల్లికార్జున, సోదరి అంబిక దొంగిలించారని ఆమె ఆరోపించారు.సెప్టెంబర్ 17న అంబిక పేరుతో రూ. 46 కోట్ల కోసం ఈ ఐదు చెక్కులను బ్యాంకులో సమర్పించినట్లు బ్యాంకు అధికారులు తనకు సమాచారం అందించారని రాధ తెలిపారు. వెంటనే అప్రమత్తమైన ఆమె, ఆ చెక్కుల చెల్లింపును నిలిపివేయాలని బ్యాంకును ఆదేశించారు. అంబికకు తాను ఎటువంటి చెక్కులు ఇవ్వలేదని, అంత పెద్ద మొత్తంలో నగదు చెల్లించాల్సిన ఒప్పందం ఏదీ తమ మధ్య లేదని ఆమె స్పష్టం చేశారు.అంతేకాకుండా, గత ఏడాదిన్నర కాలంగా తనను తన ఆస్తిలోకి అడుగుపెట్టనివ్వడం లేదని, అక్కడ విలువైన వస్తువులు, నగలు, పత్రాలు ఉన్నాయని కూడా రాధ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికలుగా రాణించిన అక్కాచెల్లెళ్ల మధ్య తలెత్తిన ఈ వివాదం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.





## పెరుగుతున్న విడాకుల సంస్కృతిపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

**సంబంధాలపై సోషల్ మీడియా ప్రభావం పెరిగిందన్న నటి**

**ఆన్‌లైన్ జీవితాలతో పోలికలు ఒత్తిడి పెంచుతున్నాయని వివరణ**

**సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి అంతా పరిపూర్ణంగానే కనిపిస్తాయని వ్యాఖ్య**

**నిజ జీవిత సమస్యలు బయటకు కనిపించవని కాజల్ అభిప్రాయం**

**ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై నిఘా ఎక్కువైందని వ్యాఖ్య**

దేశంలో విడాకులపై చర్చ పెరుగుతున్న వేళ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారుతున్న సంబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్ల దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు.సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి, ఆనందానికి సంబంధించిన ఎన్నో పోస్టులు కనిపిస్తుంటాయి. అయితే అవి ప్రతి ఒక్కరి నిజ జీవితాన్ని ప్రతిబింబించకపోవచ్చు. అందంగా కనిపించే ఫొటోలు, సంతోషకరమైన క్షణాలనే ఎక్కువగా పంచుకోవడంతో.. సంబంధాల్లో సమస్యలు, ఇబ్బందులు బయటకు కనిపించవు. దీంతో ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం మొదలవుతుందని కాజల్ పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియా నిఘా ఎక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి విషయంపైనా వచ్చే కామెంట్లు, విమర్శలు సంబంధాలపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం మహిళలపై మరింత ఎక్కువగా ఉంటుందని గతంలోనూ కాజల్ మాట్లాడారు.ప్రేమ సంబంధాల గురించి కాజల్ గతంలోనూ తన అభిప్రాయాలను వెల్లడించారు. జీవితంలో సంతోషం పూర్తిగా ప్రేమ లేదా వివాహ బంధంపైనే ఆధారపడకూడదని ఆమె చెప్పారు. భర్త గౌతమ్ కిచ్లుతో తన అనుబంధం గురించి కూడా పలు సందర్భాల్లో మాట్లాడారు.ప్రస్తుతం విడాకులపై ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. మారుతున్న అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ నేటి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని కాజల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com